

పనులు కనిగిరిలో.. పొక్లెయినర్ విజయవాడ నుంచి

కనిగిరి మున్సిపాలిటీలో కాలువల పూడికతీత పనులు టీడీపీ నేతలకు కాసులు కురిపిస్తున్నాయి.

- 8లో..



టీడీపీ వికృత క్రీడ

వైపాలెం మండలం గులిజేపల్లిలో వైఎస్సార్ సీపీ వర్గీయుల బొప్పాయి పంటను టీడీపీ వర్గీయులు ధ్వంసం చేశారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోత అధికం. అక్కడక్కడా స్వల్పంగా వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

25 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా

ఒంగోలు: జిల్లాలోని 25 పాఠశాలల్లో మళ్లీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు వాయిదా పడినట్లు సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.సుభద్ర తెలిపారు. శనివారం జిల్లాలోని 99 పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. వాటిలో ఒక స్కూలు మూతపడింది. రెండు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఒక పాఠశాలలో గత పాఠశాల కమిటీ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తికానందున ఎన్నిక నిర్వహించలేదు. మరో 21 పాఠశాలల్లో సరైన కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశామన్నారు. 74 పాఠశాలల్లో ఎన్నికలను పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఆమె తెలిపారు. వాయిదా పడిన పాఠశాలలకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ప్రభుత్వం షెడ్యూలు ప్రకటించాక చెబుతామన్నారు.

ఎంఎస్ జిల్లా కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: మాన్యువల్ స్కావెంజెర్ల (ఎంఎస్) జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంఘిక సంక్షేమశాఖాధికారి లక్ష్మానాయక్ తెలిపారు. ఎం.ఎస్ కమిటీలో నలుగురు సభ్యులు ఉంటారని, అందులో మాన్యువల్ స్కావెంజెర్లు లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీఓ)ల ప్రతినిధులు ఇద్దరు, ఎంఎస్ సంఘ కార్మిక సంఘంలో ఇరువులు ఉంటారని చెప్పారు. నలుగురిలో ఒకరు మహిళా సభ్యులు తప్పనిసరిగా ఉంటారన్నారు. ఆసక్తి కలిగిన సభ్యులు తమ పూర్తి వివరాలతో ఈనెల 26వ తేదీ లోపు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారిత కార్యాలయం ప్రగతి భవనంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

బీఈడీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఒంగోలు: బీఈడీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆంధ్రకేసరి యూనివర్శిటీ సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ పరిధిలో 110 బీఈడీ కాలేజీల్లో చదువుతున్న 11,015 మంది విద్యార్థులు ఈనెల 19 నుంచి జగరనున్న మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఇందుకోసం మొత్తం 45 సెంటర్లను ఏర్పాటు చేశామని, ప్రతి కేంద్రానికి ఒక పరిశీలకులను నియమించామని చెప్పారు. వీరితోపాటు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా కాలేజీలకు హాల్‌టికెట్లు జారీ చేశామన్నారు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ఈనెల 29న స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2023–24 క్రీడల్లో తప్పక పాల్గొని ఉండాలి. దరఖాస్తు చేసుకునే పాఠశాలలు సర్టిఫికెట్ నకలు కాపీలపై హెడ్మాస్టర్, ఫిజికల్ డైరెక్టర్ సంతకం తప్పనిసరి, టీం ఈవెంట్స్, వ్యక్తిగత ఈవెంట్లలో అత్యధిక స్కోరు సాధించిన నిర్దిష్ట పాఠశాలల పనితీరు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికచేస్తారు. క్రీడాప్రతిభ అవార్డుకు ఈనెల 18వ తేదీ సాయంత్రం 3గంటలలోగా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శికి తెలియజేయాలన్నారు.

నవోదయ ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం పొందేందుకు జవహర్ నవోదయ విద్యాలయం నిర్వహించే ఎంట్రన్స్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గీత కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని 29 మండలాల నుంచి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి (2024–25) సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. నవోదయ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని కోరారు. దరఖాస్తును విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా పెన్ నంబర్, ఆధార్ నంబర్‌తో సహా పూర్తి చేయించి, 3వ, 4వ, 5వ తరగతి చదివిన పాఠశాల వివరాలు నమోదు చేసి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చెయ్యాలని చెప్పారు. సెప్టెంబర్ 16లోపు దరఖాస్తులను అప్‌లోడ్ చేసుకోవాలని, ఎంట్రన్స్ పరీక్ష 2025 జనవరి 18న ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు www.navodaya.gov.in లేదా https://cbseitms.rcil.gov.in/nvs లను చూసి ఆ వెబ్ సైట్‌లలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.



కరవది గ్రామ సమీపం గుండ్లకమ్మలో ఇసుక నింపుతూ..

తవ్వేయ్.. దోచేయ్..

- ప్రకృతి సంపద కొల్లగొడుతున్న 'పచ్చ' మాఫియా
- 'గుండ్లకమ్మ'ను మింగేస్తున్నారు
- కొత్తపట్నం తీరంలో ఇసుక తిన్నెలు మాయం
- రాత్రి వేళ వందల ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా
- జనం పట్టి అప్పగించినా వదిలేస్తున్న పోలీసులు
- టంగుటూరు మండలం అనంతవరంలో వైట్ శాండ్ మాఫియా
- ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతామంటూ కలెక్టర్, ఎస్పీ హెచ్చరికలు
- అయితే ఏంటి.. డోంట్‌కేర్ అంటున్న తమ్ముళ్లు

'సంపద సృష్టిస్తా.. సంపద సృష్టిస్తా.. అంటే అందరూ జనానికి సంపద సృష్టిస్తా రనుకున్నారు. కానీ అధికార పార్టీ అనుయాయులకు అయాచిత ఆదాయం సమకూర్చి పెట్టడానికి కూటమి ప్రభుత్వం 'పచ్చ' జెండా ఊపింది. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. పథకాలను పక్కన పెట్టేశారు. ప్రకృతి సంపదను కొల్లగొట్టడానికే 'అధికారం' ఇచ్చినట్లుగా అణువణువు దోచేస్తున్నారు. టీడీపీ ముఖ్య నేతల కనుసన్నల్లో ఆ పార్టీ చోటా నాయకులు, మద్దతుదారులు విచ్చలవిడిగా ఇసుక నిల్వలు తవ్వేసి జేబులు నింపుకొంటున్నారు. ఊరు శివారు.. నీరు పారే ఏరు.. వాగూ వంక.. అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఇసుక తవ్వి తరలిస్తున్నారు. ఇసుక ఉచితం అని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది కానీ, వాస్తవానికి వినియోగదారులకు నయాపైసా ప్రయోజనం లేదు. అదే సమయంలో అక్రమ దందాకు బార్లా గేట్లు తెరవడంతో ఇసుక తిన్నెలు, వాగూ వంకలపై తెలుగు తమ్ముళ్ల ట్రక్కులు, జేసీబీలతో దండయాత్ర సాగిస్తున్నారు. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ నేలతల్లి ఒడిలో నిర్విరామంగా ధ్వంస రచన సాగిస్తున్నా.. రెవెన్యూ, పోలీస్ అధికారులు మౌనం దాల్చడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల హెచ్చరికలు జనాన్ని మోసం చేస్తున్నట్లుగా ఉన్నాయని చీదరించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అధికారంలోకి రాకముందు నిరుపేదలందరికీ ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఉచితానికి స్వస్తి పలికారు. ఇదే అదునుగా భావించిన పచ్చనేతలు గ్రామాల్లో ఇసుకను కొల్లగొట్టి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో సామాన్య ప్రజలు ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక గగనంగా మారిపోయింది. గ్రామస్థాయిలో సామాన్యులు ఇసుక కోసం వెళితే మా ట్రాక్టర్‌తో తోలుకోండి లేకపోతే లేదు అంటూ పచ్చనేతలు బెదిరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్, ఎస్పీ హెచ్చరించారు. అయినా లెక్క చేయకుండా పచ్చపార్టీ నేతలు నగరం చుట్టూ ఉన్న గ్రామాల్లో సహజవనరుల్నీ యథేచ్ఛగా దోచేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడువుగా ఒంగోలు మండలంలోని కరవది గ్రామంలో గుండ్లకమ్మ నది నుంచి పచ్చనేతలు ఇసుకను తోడి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రాత్రుళ్లు జేసీబీలతో ఇసుకను తవ్వి గుట్టలు పోస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉండే అధికారపార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో ప్రతి రోజు 10 నుంచి 15 ట్రాక్టర్లతో



గుండ్లకమ్మ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

ఇసుకను తోడేస్తున్నారు. బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా నివసించే ప్రజలు తమ అవసరాల కోసం ఇసుక కావాలంటూ వెళితే టీడీపీ నాయకులు బెదిరిస్తూ మీరు మా ట్రాక్టర్ల ద్వారా ట్రిప్పుకు రూ.4 వేలు చొప్పున కొనాల్సిందేనని తెగేసి చెబుతున్నారని వాపోతున్నారు. ఈ అక్రమ ఇసుక దందాను అరికట్టాలంటూ స్థానికులు సెబ్ అధికారులకు, పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సుమారు నెలకు రూ.కోటి 60 లక్షల వరకు ఇసుక అక్రమ వ్యాపారం జరుగుతోందని తెలుస్తోంది. పచ్చ నేతల అండదండలతో జరుగుతున్న ఇసుక తవ్వకాలతో నదీతీరం కోతకు గురౌతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు విమర్శిస్తున్నారు. జేసీబీలతో పెద్ద పెద్ద గుంతలు తవ్వి ఇసుకను తీయడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వందల ట్రాక్టర్లు, టిప్పర్లతో..

కొత్తపట్నంలో ఇసుక క్వారీలే లేవు. ఇక్కడి నుంచి ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఇసుక కావాలంటూ తహసీల్దార్ వద్ద కొందరు అక్రమార్కులు అనుమతులు తీసుకున్నట్లు సమాచారం. ఇదే అదునుగా కూటమి నాయకులు అడ్డగోలుగా దోచేస్తున్నారు. భారీగా వాహనాలతో ఇసుకను పక్కదారి పట్టించి సొమ్ముచేసుకుంటున్నారు. కమీషన్ తీసుకుని మరీ ఇసుక తరలిస్తున్నారు. రాత్రయితే చాలు.. వందల ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. కూటమి నాయకులు అధికారులను లెక్కచేయకుండా చెలరేగిపోతున్నారు. చివరకు గ్రామస్తులే ఇసుక టిప్పర్ పట్టుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తే.. సాయంత్రంలోపే పోలీసులు విడిచిపెట్టారు. కూటమి నేతలకు పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు కొమ్ముకాస్తున్నాయనడానికి ఇదే నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలని కొత్తపట్నం మండల ప్రజలు కోరుకుంటున్నారు.



కొత్తపట్నంలో ఇసుక మేటలు

వైట్ శాండ్.. లారీ రూ.50 వేలు

టంగుటూరు మండలం అనంతవరం పంచాయతీ పరిధిలోని తేటుపురం గ్రామంలో మన్నేం రవణమ్మ పట్టా భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా టీడీపీ నాయకులు జేసీబీ సహాయంతో రాత్రి వేళల్లో ఇసుక రవాణా దందా నిర్వహిస్తున్నారు. రాత్రి వేళ ట్రాక్టర్లతో గ్రామ శివారు ప్రాంతానికి తరలించి, అక్కడి నుంచి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. తెల్ల ఇసుక కావడంతో ఒక్కో లారీ రూ.50 వేలకు అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారు. అధికారులు కూడా చూసి చూడనట్లుగా ఉండటంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సెబ్, రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

నీటి సరఫరాలో ఇబ్బందులు

తేటుపురం గ్రామానికి మంచి నీరు సరఫరా అయ్యే పంప్ హౌస్ సమీపంలో ఇసుక తవ్వకాలు జేసీబీతో తవ్వడంతో దీంతో ఆ ప్రాంతం మొత్తం గుంతలు మారింది. దీంతో భూగర్భ జలాలు తగ్గి గ్రామానికి మంచి నీటికి ఇబ్బందులు పడే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలు నిలిపేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.



తేటుపురం పంప్ హౌస్ సమీపంలో ఇసుక తవ్వకాలు

ఏరు కొల్లగొట్టి

ఇసుకాసురులు మద్దిపాడు ఏరును కొల్లగొట్టేస్తున్నారు. టీడీపీ నాయకుల అండదండలతో రాత్రిళ్లు రేవు నుంచి ట్రాక్టర్లతో ఇసుక తరలించేస్తున్నారు. ఇటీవల జేసీ గోపాల కృష్ణ నేరుగా ఇసుక రీచ్‌లోకి వెళ్లి ట్రాక్టర్, జేసీబీలను సీజ్ చేయడంతో అక్రమ రవాణాకు తాత్కాలికంగా చెక్ పడింది. తర్వాత పరామామూలే. రాత్రి పూట ఇసుకను తరలించేసి అధికారులు కార్యాలయాలకు వచ్చే సమయానికి ట్రాక్టర్లు షెడ్‌లోకి చేరిపోతున్నాయి. విజిలెన్స్ అధికారుల నిఘా కొరవడడంతో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

న్యాయం కోసం గొంతెత్తిన జూడాలు

- మెడికల్ కళాశాల నుంచి చర్చి సెంటర్ వరకు భారీ ర్యాలీ
- జూడాలకు మద్దతుగా ఎంసీహెచ్ వైద్యుల ర్యాలీ
- ప్రైవేటు హాస్పిటళ్లలో వైద్య సేవలు బంద్ చేసిన ఐఎంఏ

ఒంగోలు టౌన్: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం కేసులో జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఉద్యమం రోజురోజుకూ ఉధృతం అవుతోంది. విధులు బహిష్కరించిన జూనియర్ వైద్యులు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామంటూ నిరసన దీక్షలకు దిగారు. ఈ దీక్షలకు మద్దతుగా ఐఎంఏ కూడా పోరాట బాట పట్టింది. భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ), ఐద్వాలు కూడా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజల నుంచి కూడా మద్దతు పెరుగుతోంది. శుక్రవారం నిరసన దీక్షలు ప్రారంభించారు. సాయంత్రం మెడికల్ కళాశాల వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. తిరిగి శనివారం ఉదయం జూనియర్ డాక్టర్లు భారీ ర్యాలీ ప్రదర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి ర్యాలీగా బయలు దేరిన జూనియర్ డాక్టర్లు చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. మెడికల్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్కిట్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యుల సంఘం వైస్ ప్రెసిడెంట్ డా.శృతి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేసేంత వరకు, దేశంలోని వైద్యులకు, ముఖ్యంగా మహిళా వైద్యులకు రక్షణ కల్పించేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఇంత ఉద్యమం జరుగుతున్నా ప్రభుత్వాలు పెద్దగా స్పందించకపోవడం బాధాకరమన్నారు. సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ సెక్రటరీలు ఓ.చైతన్య సాయి, డా.విష్ణు ప్రియ, కోశాధికారి డా.బి.రాము, హర్షిత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు డా.శివరామకృష్ణ, డా.నాగేంద్ర, డా.సత్యసాయి, డా.చరణ్, డా.మాధవి, డా.అవినాష్, డా.సాయి పవిత్ర తదితరులు నాయకత్వం వహించారు.



ఒంగోలు చర్చి సెంటర్‌లో మానవహారం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

వైద్యులపై దాడి చేయాలంటే భయపడేలా చట్టం చేయాలి: ఐఎంఏ

జిల్లాలో మొత్తం 200 లకు పైగా నర్సింగ్ హోంలు ఉన్నాయి. సుమారు 700లకు పైగా వైద్యులు నిత్యం వైద్య సేవలు అందిస్తున్నారు. కోల్‌కత్తా జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ప్రైవేటు వైద్యశాలలు బంద్ చేశారు. సాధారణ వైద్య సేవలను నిలిపేశారు. అత్యవసర సేవలను మినహాయించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని ఐఎంఏ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.జాలాది మణిబాబు మాట్లాడుతూ...కోల్‌కత్తా ఐజికార్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య యావత్ దేశాన్ని కదిలించిందన్నారు. సమావేశంలో సీనియర్ వైద్యులు డా.శ్రీమన్నారాయణ, డా.మధుకిరణ్ రెడ్డి, డా.సరోజిని దేవి, డా.జాకబ్, డా.మానస, డా.అర్పణ, డా.ఆశ, డా.శారా, డా.హనుమంతరావు పాల్గొన్నారు.

జూడాలకు మాతా శిశు వైద్యశాల సంఘీభావం..


కోల్‌కత్తా జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన పోరాటానికి మాతా శిశు వైద్యశాల వైద్యులు, వైద్య సిబ్బంది సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఏపీవీవీపీ డాక్టర్స్ జేఏసీ పిలుపు మేరకు ఎంసీహెచ్ మెడికల్ ఆఫీసర్ డా.సంధ్య నాయకత్వంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి: ఐద్వా, ఎస్ఎఫ్ఐ

కోల్‌కత్తా ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం చేసి హత మార్చడం దారుణమని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ వైద్యశాలలోని ఒక వైద్యురాలికే రక్షణ లేకపోతే ఇక సామాన్య మహిళలకు రక్షణ ఏముంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను బెంగాల్ ప్రభుత్వం రక్షిస్తుందని వస్తున్న ఆరోపణలకు ఆమె సమాధానం చెప్పకుండా ర్యాలీ నాటకాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో రోజుకు 87 అత్యాచారాలు, గంటకు 49 దాడులు జరుగుతున్నాయన్నారు. కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ నగరంలోని సాయిబాబా గుడి సెంటర్లో మహిళలు, విద్యార్థినులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి వెంకటస్వామి, డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు పి.కిరణ్, ఐద్వా నాయకులు కా.రాజేశ్వరి, బి.పెద్ద గోవిందమ్మ పాల్గొన్నారు.

ఎంసీహెచ్ వైద్యుల మద్దతు

జూనియర్ వైద్యురాలిపై అత్యంత క్రూరంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులకు, వైద్యశాలలకు తగిన రక్షణ కల్పిస్తూ చట్టం చేయాలని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చిరంజీవి, కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న వైద్యుల మీద కూడా నిందితులు దాడికి పాల్పడడం ఘటన తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు

సర్వం'లక్ష్మీ'మయం

- బస్ షెల్టర్ల నిర్మాణంలో అక్రమాలు
- నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయింపు
- ప్రొటోకాల్‌కు మంగళం
- టీడీపీ నాయకురాలితో ప్రారంభోత్సవం

దర్శి: దర్శి పట్టణంలో బస్‌షెల్టర్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్లు పిలిచి పనులు కేటాయించాల్సి ఉండగా అధికార పార్టీ నాయకులకు మేలు చేసేలా నామినేషన్ల విధానంలో పనులు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణంలో అక్రమాలు ఒక ఎత్తయితే కనీస ప్రొటోకాల్ పాటించకుండా అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మితో ప్రారంభించడం వివాదానికి దారితీస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. దర్శి పట్టణం గడియారం స్తంభం సెంటర్ అద్దంకి రోడ్డులో ఒకటి, కురిచేడు రోడ్డులో మరొకటి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ నిధులతో వీటిని నిర్మించారు. రెండు బస్‌షెల్టర్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు చేశారు. నిబంధనల ప్రకారం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించాల్సి ఉంది. టీడీపీ నేతలకు ఈ పనులు అప్పగించాలన్న దురుద్దేశంతో రూ.5 లక్షలు చొప్పున రెండింటిని నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. టెండర్లు పిలిస్తే తక్కువ ఖర్చుతో పనులు పూర్తయ్యేవని, అయితే అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చి నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించేలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రొటోకాల్ ఉల్లంఘన..

నూతనంగా నిర్మించిన రెండు బస్‌షెల్టర్లను ఈ నెల 15వ తేదీ ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరించారు. ఎలాంటి అధికారిక పదవిలేని, కేవలం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గొట్టిపాటి లక్ష్మితో ప్రారంభించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్‌షెల్టర్లను పసుపుమయం చేయడమే కాకుండా పైన, లోపల లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిల్లో సైతం అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఇన్‌చార్జి లక్ష్మి ఫొటోలు ఉంచారు. నగర పంచాయతీ చైర్మన్‌గా ఉన్న నారపుశెట్టి పిచ్చయ్య ఫొటో కూడా లేకపోవడం గమనార్హం. బస్ షెల్టర్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టారు కానీ ఆయన ఫొటోను మాత్రం విస్మరించారు. దీనిపై ఎన్టీఆర్ అభిమానులు లోలోన మదన పడుతున్నారు. దీంతో బస్‌షెల్టర్‌ను చూసిన వారు గొట్టిపాటి లక్ష్మి తన సొంత నిధులతో నిర్మించారేమోనని అనుకుంటున్నారు. బస్ షెల్టర్ నిర్మాణం ఎవరు చేశారని నగర పంచాయతీ డీఈని సంప్రదించగా ఒక్కో షెల్టర్‌కు రూ.5 లక్షలు లెక్కన నగర పంచాయతీ నిధులతో నామినేషన్ పద్ధతిలో నిర్మించామని చెప్పారు.



అద్దంకి రోడ్డులో నిర్మించిన బస్ షెల్టర్‌పై గొట్టిపాటి లక్ష్మి ఫొటోతో లైటింగ్ బోర్డు

క్లుప్తంగా

పొగాకు గరిష్ట ధర రూ. 359


పొదిలిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరధిలో శనివారం పొగాకు కేజీ గరిష్టంగా రూ. 359 ధర పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 9,837 బేళ్లు రాగా, 8,255 బేళ్లు కొనుగోలు చేశారు. 1582 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 133వ రోజు వేలం పాటలో 5,536 బేళ్లు రాగా 4,821 కొనుగోలు చేసి.. 715 బేళ్లు తిరస్కరించారు. కనిష్టంగా రూ. 204, సరాసరి రూ. 311.89 పలికాయి. కందుకూరు-1, 2, కనిగిరి, పీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 127వ రోజు వేలం పాటలో 4,301 బేళ్లు రాగా 3434 బేళ్లు కొనుగోలయ్యాయి. 867 బేళ్లు తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ. 358, కనిష్ట ధర రూ. 204, సరాసరి రూ.287.44 పలికింది.

ఒంగోలు డీఎస్పీగా రాయపాటి



ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు మొక్క అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: ఒంగోలు సబ్ డివిజన్ డీఎస్పీగా రాయపాటి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన శ్రీకాకుళం జిల్లా మహిళా పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించారు. 1991లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీసు శాఖలో ప్రవేశించి వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రకాశం జిల్లాతో మంచి అనుబంధం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై ఆయనకు ఎస్పీ పలు సూచనలు చేశారు.

15 శాఖల్లో బదిలీలకు గ్రీన్ సిగ్నల్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ 15 శాఖలకు సంబంధించి బదిలీల ప్రక్రియ నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో బదిలీ ప్రక్రియ ప్రారంభం అయింది. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన శాఖల్లో రెవెన్యూ (ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్), పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్.. అర్బన్ డెవలప్‌మెంట్, గ్రామ, వార్డు సచివాయాలు, సివిల్ సప్లయిస్, మైనింగ్ అండ్ జియాలజీ, అన్ని శాఖల్లో ఇంజినీరింగ్ సిబ్బంది, ఎండోమెంట్స్, రవాణా, ఈఎఫ్ఎస్ అండ్‌టీ, పరిశ్రమలు, ఎనర్జీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్ శాఖల్లో బదిలీ ప్రక్రియ చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. బదిలీ అయ్యే అధికారులు, ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను ఆశ్రయించి కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని డబ్బు సంపాదించే యోచనలో కూటమి నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

పనులు కనిగిరిలో.. పొక్లెయినర్ విజయవాడది..!

- కనిగిరి మున్సిపాలిటీలో అవినీతి కంపు
- మురుగు కాలువల్లో పూడిక తీత నిధుల దోపిడీకి సిద్ధం
- టీడీపీ నేతలకు ఉపాధి మార్గంగా పనులు
- నిబంధనలకు తిలోదకాలిచ్చిన మున్సిపల్ కమిషనర్


కనిగిరిలో జరిగిన పూడికతీత పనులు

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో కాలువల పూడికతీత పనులకు సంబంధించిన నిధులను మింగేసేందుకు అధికార పార్టీ నేతలు సిద్ధమయ్యారు. అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు తిలోదకాలిచ్చి లక్షల రూపాయలు స్వాహా చేసేందుకు పన్నాగం పన్నారు. అద్దెకు పొక్లెయినర్ స్థానికంగా లభ్యమవుతున్నా విజయవాడ నుంచి తీసుకొచ్చి పనులు చేయించారు. ఈ విషయం పరిశీలిస్తే కనిగిరి మున్సిపాలిటీలో అవినీతి కంపు ఏమేరకు ఉందో అవగతమవుతుంది. సంపూర్ణ పారిశుధ్య చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో (డీ సిల్టేషన్) కాలువల్లో పూడిక తీత, మురుగు తొలగింపు పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీ, నగర పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తూ జూలై 24న సంబంధిత శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 10వ తేదీ లోగా ఆ నిధులు ఖర్చుచేసి నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లాలోని కనిగిరి మున్సిపాలిటీకి రూ.33.41 లక్షలు, చీమకుర్తి రూ.22.61 లక్షలు, గిద్దలూరు రూ.26.24 లక్షలు, మార్కాపురానికి రూ.53.08 లక్షలు, దర్శికి రూ.24.95 లక్షలు, పొదిలి రూ.28.74 లక్షల నిధులు మంజూరు చేసినట్లు నివేదికలు ఉన్నాయి.

తెలుగు తమ్ముళ్లకే పట్టం

పూడిక తీత పనుల్లో కనిగిరి మున్సిపల్ అధికారులు నిబంధనలకు తూట్లు పొడిచారు. మురుగు కాలువల పరిశుభ్ర పనులను టెండర్ల ద్వారా కేటాయించాల్సి ఉంది. అయితే కనిగిరిలో మాత్రం అధికార పార్టీ నాయకులకు మేలు చేసేలా అధికారులు వ్యవహరించారు. టెండర్లు పిలవకుండానే నామినేషన్ పద్ధతిలో తెలుగుదేశం పార్టీ నేతలకు అప్పగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించినా మున్సిపల్ కౌన్సిల్ అనుమతి పొందాలి. కానీ అవేమీ పట్టించుకోకుండా మున్సిపల్ కమిషనర్ గప్‌చుప్‌గా అధికార పార్టీ నేతలకు పనులు కట్టబెట్టారు.

విజయవాడ నుంచి పొక్లెయినర్

మున్సిపాలిటీలో కమిషనర్ రూటే సప'రేటు'గా మారింది. నిబంధనలకు పూర్తిగా తిలోదకాలిచ్చి పూడిక తీత నిధులు ఖర్చు చేసినట్లు సమాచారం. రూ.33 లక్షల నిధుల వినియోగానికి టెండర్ ప్రకటన ఇవ్వలేదు. టెండర్‌లో పని ఎవరికి వచ్చినా.. టెండర్ కాల్ ఫర్ చేస్తే.. కనీసం కనిగిరి వాసులకు పనులు దక్కుతాయి. అలా కూడా చేయకుండా నేరుగా విజయవాడ నుంచి ఓ కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకుని తీసుకొచ్చి పనులు చేయించారు. రూ.33 లక్షల్లో ఇప్పటికే రూ.3 లక్షలు చెల్లించారు. పొక్లెయినర్‌తో పూడిక తీతకు రోజుకు రూ.1 లక్ష చొప్పున ఖర్చు చేసినట్లు మరో రూ.28 లక్షలు డ్రా చేసేందుకు పథకం సిద్ధం చేసినట్లు తెలిసింది. జరిగిన పనులకు బిల్లులు క్యూబిక్ మీటర్ లెక్కన చెల్లించాల్సి ఉంది. దీనికి ఏమేరకు నిబంధనలు పాటించారు.. ఎంత మేర న్యాయబద్ధంగా వ్యవహరించారనేది ప్రశ్నార్థకం.

ఐదేళ్లలో 15 శాతం వృద్ధి లక్ష్యం


వికసిత్ ఆంధ్రప్రణాళికలపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- వికసిత్ ఆంధ్ర-2047 పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 2047 నాటికి దేశం అభివృద్ధి చెందాలనే లక్ష్యానికి సంబంధించి రానున్న ఐదేళ్లలో జిల్లాలో ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించాలని ఆ మేరకు జిల్లా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాశం భవనంలో వికసిత్ ఆంధ్ర-2047కు సంబంధించి జిల్లా యాక్షన్ ప్లాన్ 2024-29పై అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకుని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి వంద రోజులు, సంవత్సర ప్రణాళికలు తయారు చేశారన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో జీడీపీ వృద్ధి చేసుకునేందుకు వ్యవసాయ, ఉద్యాన అనుబంధ పారిశ్రామిక, ఆక్వా తదితర రంగాల ద్వారా ఉన్న అవకాశాలను సద్వినియోగంచేయాలన్నారు. ఉద్యా పంటల విస్తరణ దిశగా రైతులను ప్రోత్సహిస్తే మరింత జీడీపీ వృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని, అందుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి సారించి ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించాలని ఆదేశించారు. దీనిలో సీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ మాధురి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, పశు సంవర్థక శాఖ జేడీ బేబిరాణి, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు 'స్వీకారం' జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతి కోసం 'స్వీకారం' పేరుతో ఒక మంచి కార్యక్రమాన్ని రూపొందించామని కలెక్టర్ తెలిపారు. ప్రకాశం భవనంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం అమలులో భాగంగా పలు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో కార్పొరేట్ సంస్థలు తమవంతు సహకారం అందిస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం చేపట్టిన స్వీకారం కార్యక్రమంలో హాస్టళ్లను దత్తత తీసుకోవాలని అన్నారు. దత్తత తీసుకున్న వసతి గృహాల్లో కిటికీలకు మెష్‌లు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, లైటింగ్, ఫ్యాన్లు, ఫ్లోరింగ్, తాగునీరు పచ్చదనం వంటి పనుల్లో అభివృద్ధికి కార్పొరేట్‌లు సహకరించాలన్నారు. దీనిలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, మైన్స్ డీడీ జగన్నాథరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, ఇతర అధికారులు పలు గ్రానైట్ యజమానలు, హేచరీస్ ప్రతినిధులు ఆపల్గొన్నారు.

మాయమైపోయాడులే మనిషి!

- మహిళ మృతదేహాన్ని అద్దె ఇంటికి రానివ్వని యజమాని
- అంబులెన్స్‌లోనే శవాన్ని పెట్టుకొని అంత్యక్రియల కోసం ఎదురు చూపులు


అంబులెన్స్‌లో శవాన్ని పెట్టుకొని అక్కడే ఉన్న బంధువులు


మృతురాలు డింగిరి కమల (ఫైల్)

కంభం: పొట్టకూటి కోసం పక్క దేశం నుంచి ఇక్కడికి వచ్చిన ఓ కుటుంబంలో అనుకోని విషాదం జరిగింది. అతని భార్య ఆత్మహత్య చేసుకోగా ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంతో మృత దేహాన్ని తీసుకొని వారు అద్దెకు ఉంటున్న ఇంటికి తీసుకురాబోగా..

యజమాని అడ్డుకున్నాడు. దీంతో దిక్కు తోచని స్థితిలో అంబులెన్స్ లోనే మృతదేహాన్ని పెట్టుకొని ఎప్పుడు తెల్లారుతుందా అని ఆ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్న విషాదకర ఘటన కంభంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నేపాల్‌కు చెందిన డింగిరి సాగర్ అనే వ్యక్తి కంభంలో గూర్ఖాగా, పెయింటర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య డింగిరి కమల (24) శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. అయితే ఆమె తల్లిదండ్రులు నేపాల్‌లో ఉండటంతో ఇక్కడికి రాలేక పోయారు. కాగా బెంగళూరులో ఉన్న సోదరులు, ఇతర బంధువులు కంభం చేరుకున్నారు. వారు మృతదేహాన్ని పట్టణంలోని అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు తీసుకెళ్లగా ఆ ఇంటి యజమాని ఒప్పుకోలేదు. ఎవరిని సహాయం అడగాలో తెలియని పరిస్థితిల్లో అంబులెన్స్ డ్రైవర్‌ను బతిమిలాడుకుని ఊరికి చివర రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఓ ప్రవేటు కళాశాల మైదానం వరకు వెళ్లారు. కుటుంబ సభ్యులు అంబులెన్స్ దగ్గరే కూర్చొని తెల్లవారితే ఎక్కడికైనా అంత్యక్రియలు చేద్దామని కుమిలిపోతున్నారు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. అనాథ శవాలకు సైతం అంత్యక్రియలు చేస్తున్న ఈ రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమని పలువురు ఆవేదన చెందారు.


బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నాయకులు

టీడీపీ వికృత క్రీడ

- వైఎస్సార్ సీపీ వర్గీయుల బొప్పాయి పంట ధ్వంసం
- మండిపడిన ఎమ్మెల్యే తాటిపర్తి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: టీడీపీ ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మండలంలోని గురిజేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులకు చెందిన బొప్పాయి పంటను టీడీపీ ముష్కరులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వలేదన్న ఆక్రోశంతో వారు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు భవనం శివారెడ్డి, వెన్నా రాజమోహన్‌రెడ్డి, కందుల కాశిరెడ్డి, కందుల శ్రీనివాసరెడ్డి దాదాపు 7 ఎకరాల్లో బొప్పాయి మొక్కలను పెంచుతున్నారు. దీంతో వారిని ఆర్థికంగా దెబ్బతీసేందుకు కొంతమంది టీడీపీ వారు.. రాత్రి సమయంలో పొలాల్లోకి వెళ్లి బొప్పాయి చెట్లను విచక్షణారహితంగా నరికి వేశారు. శనివారం వేకువ జామున బొప్పాయి తోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన ఆ రైతులు పరిస్థితిని గమనించి కన్నీరు మున్నీరయ్యారు. ఎకరాకు దాదాపు రూ. 53 వేలు ఖర్చుపెట్టి బొప్పాయి మొక్కలను నాటుకున్నామని, 7ఎకరాలకు గాను ఇప్పటి వరకు రూ. 3.71లక్షలు ఖర్చు చేశామని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టీడీపీ వర్గీయులది దుశ్చర్య

గురిజేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రైతులు పెంచుతున్న బొప్పాయి పంటను ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య అని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. నిజాయితీగా ఉన్న తమను ఎదుర్కోలేక ఇటువంటి వాటికి పాల్పడుతున్నారని, నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తమ వారిని బెదిరించి వారి వర్గంలోకి చేర్చించుకొని గ్రామాల్లో పెత్తనం చెలాయించాలన్న దురుద్దేశంతో టీడీపీ వర్గీయులు ఇటువంటి అరాచకాలకు పాల్పడుతున్నరని విమర్శించారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, నాయకులు ఏకుల ముసలారెడ్డి, కందూరి గురుప్రసాద్, షేక్ మౌలాలి, బి.బాలచెన్నయ్య, ఒంగోలు సుబ్బారెడ్డి, కందుల నాగార్జునరెడ్డి, రాములు నాయక్, డి.హరిబాబు నాయక్ ఉన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి


ప్రమాదంలో మృతి చెందిన మౌలాభి

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురం వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడటంతో షేక్ మౌలాభి (38) అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని వేముల గ్రామానికి చెందిన వంట పనులు చేసే ముఠా వారు ఉమామహేశ్వరపురంలో పనులు ముగించుకొని శనివారం రాత్రి ఆటోలో స్వగ్రామం వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో షేక్ మౌలాభి అక్కడికక్కడే మృతి చెందగా ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు, మరో మహిళ షేక్ మీనూకి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

పాఠశాల కమిటీ ఎన్నికల్లో దౌర్జన్యం


చించేసిన పేపర్లు

- ఎన్నికల అధికారి చేతుల్లో ఉన్న పేపర్లు చించిన టీడీపీ కార్యకర్త
- చివరికి వైఎస్సార్ సీపీ మద్దతుదారులే కమిటీ సభ్యులుగా ఎన్నిక

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట పంచాయతీ పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాల మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. ఈ నెల 8వ తేదీన జరగాల్సిన పాఠశాల కమిటీ ఎన్నిక కోరంలేదనే సాకుతో వాయిదా వేశారు. మళ్లీ అధికారుల ఆదేశాల మేరకు శనివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నికల నిర్వహించారు. 10 గంటలకు ఓటుహక్కు ఉన్నవారిని లోపలికి అనుమతించి మిగతా వారిని అధికారుల సూచనలతో పోలీసులు బయటకు పంపించారు. తదుపరి పాఠశాలలో 8 తరగతులకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉండటం టీడీపీ నాయకులకు రుచించలేదు. ఎలాగైనా మళ్లీ ఎన్నిక ఆపాలని నానా ప్రయత్నాలు చేశారు. ఒక దశలో టీడీపీ వారికి బలం లేదని గుర్తించి వారి మనుషులను ఎన్నికల్లో పాల్గొనకుండా బయటకు తీసుకెళ్లారు. అయినా అన్ని తరగతులకు సంబంధించి కోరం సరిపోవటంతో ఎన్నిక జరిపారు.


ఎన్నికల అధికారులతో గొడవ పడుతున్న టీడీపీ కార్యకర్త బసవయ్య

చివరికి వైఎస్సార్ సీపీ మద్దతుదారులే కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అయితే మళ్లీ ఎన్నిక వాయిదా వేయాలనే ఉద్దేశంతో టీడీపీ కార్యకర్త, పాఠశాలలో ఓటు హక్కు ఉన్న కె.బసవయ్య బయట నుంచి దూకుడుగా పాఠశాల సభ్యులు ఉన్న గదిలోకి వెళ్లి టేబుల్‌పై ఉన్న పేపర్లు చించి బయట వేశాడు. ఎన్నిల అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎంఈఓ డాంగేషరీఫ్ పాఠశాలకు వచ్చి జరిగిన సంఘటనపై విచారించారు. మేనేజింగ్ కమిటీ చైర్మన్‌గా రావి వెంకట బ్బారెడ్డి, వైస్ చైర్మన్‌గా గొంగటి కృపమ్మతో పాటు 24 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన ఆశల తేరాతేజీ

- వేడుకలకు చారిత్రక కంభం చెరువు సిద్ధం
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కంభంలోనే జరిగే తేరాతేజీ
- పెళ్లి దండలు చెరువులో వదిలి మొక్కులు తీర్చుకోనున్న కొత్త జంటలు
- భారీగా తరలిరానున్న ముస్లింలు
- కోలాహలంగా చెరువు కట్ట


పెళ్లి నాటి దండలను కంభం చెరువులో వదులుతున్న నూతన జంట (ఫైల్)

కంభం: తేరాతేజీ (గరికతొక్కుడు) వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కంభంలోనే ఈ వేడుకలు జరగడం ప్రత్యేకత. చారిత్రక కంభం చెరువుకట్టపై ఆదివారం ముస్లిం నూతన జంటలు.. వేలాదిగా వారి బంధుగణం ఇక్కడకు చేరుకోనున్నారు. వాస్తవానికి ఈ పండగకు ప్రభుత్వ సెలవు ఉండదు. కానీ ఇక్కడ వారు మాత్రం ఇది అతి ముఖ్యమైన వేడుకగా భావిస్తారు. దూరప్రాంతాల్లో ఉన్న పిల్లలైతే పాఠశాలలకు.. పెద్దలైతే వారి పనిపాటలు వదిలిపెట్టి, సెలవులు తీసుకొని మరీ స్థానికంగా ఉండే బంధువుల ఇళ్లకు రెండు మూడు రోజుల ముందే చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తేరాతేజీని ఎంతో కాలం నుంచి ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. అంతా చెరువు కట్ట వద్దకు చేరుకొని భోజనాలు చేసి సాయంత్రం వరకు సరదాగా గడిపి వెళుతుంటారు. ఇదే సమయంలో ముస్లిమేతరులు కూడా ఈ వేడుకలో పాల్గొనేందుకు తరలి వస్తారు. కర్నూలు, గుంటూరు, నంద్యాల, గిద్దలూరు, దొనకొండ, వినుకొండ, తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారు. రైళ్లలో వచ్చే వారు అయితే ఈ తంతు చూసి రైళ్ల నుంచి దిగి మరీ ఇందులో పాలుపంచుకోవడం విశేషం. ఈ సారి ఆదివారం రావడంతో అధిక సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉంది.


పండగ నాడు కోలాహలంగా కంభం చెరువు (ఫైల్)

ఏమిటీ తేరాతేజీ?

నెలపొడుపు కనిపించిన 13వ రోజు తేరాతేజీ పండగను జరుపుకుంటారు. ముస్లింల క్యాలెండర్ ప్రకారం తేరాతేజీని చేదు నెలగా చెబుతుంటారు. అందుకే కొత్తగా పెళ్లైన వధూవరులు నెల పొడుపు తర్వాత ఒకరి ముఖం ఒకరు చూసుకోకుండా 13వ రోజు తేరాతేజీ పండగ సందర్భంగా కంభం చెరువు కట్టపై కలుసుకుంటారు. అక్కడే వారి పెళ్ళినాటి దండలను నీటిలో వదిలి మొక్కులు తీర్చుకుంటారు. ఆతర్వాత కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తారు. చెరువు కట్ట పైన ఉన్న దీనాషావళి దర్గా వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. దీనిలో భాగంగా ఇప్పటికే దర్గా అందంగా ముస్తాబు అయింది. అదే విధంగా చెరువుకట్టపై ఉన్న పచ్చికను తొక్కితే ఆరోగ్యానికి మంచిదని నమ్ముతారు. అందుకే ఈ వేడుకను గరికతొక్కుడు పండుగగా పిలుస్తారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బందోబస్తు

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు కంభం బస్టాండులో దిగి ఆటోల్లో చెరువుపైకి చేరుకుంటారు. కొందరు కార్లలో నేరుగా వస్తారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ట్రాక్టర్లలో, పెద్ద వాహనాల్లో కుటుంబాలతో చెరువుకట్టపైకి వస్తారు. ఇలా అధిక సంఖ్యలో వాహనాలు వస్తున్న దృష్ట్యా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై పులిరాజేష్ తెలిపారు. తూముల వద్ద, మెట్ల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.